క్లుప్తంగా

లింకురోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత



భూమి పూజ చేస్తున్న జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పేరయ్య

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల వారీగా లింకురోడ్ల నిర్మాణానికి లక్షలాది రూపాయల నిధులు మంజూరుతో అధిక ప్రాధాన్యత ఇస్తుందని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బూసావారిపాలెం, మక్కెనవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న 1.5 కిలోమీటర్ల లింకురోడ్డుకు ఉపాధిహామీ పథక నిధులు రూ. 8.5 లక్షలు మంజూరు కాగా చింతల పేరయ్య భూమి పూజలతో పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కె. శంకరరెడ్డి, ఎమ్. వెంకటేశ్వర్లు, టీ. వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడిగా శంకరశెట్టి



డాక్టర్ కొండలరావు

చీరాల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లాకు వైద్య విభాగం అధ్యక్షుడిగా చీరాల ఐకాన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శంకరశెట్టి కొండలరావు నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర కార్యాలయం మంగళవారం పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించింది. చీరాలలో ఆర్థోపెడిక్ వైద్యుడిగా పేరుగాంచిన కొండలరావును వైద్య విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తూటుకాడ తొలగించాలని వినతి



వినతి పత్రంతో మత్స్యకారులు

చినగంజాం: రొంపేరు కాలువలో తూటు కాడ, గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయి వేట చేసుకునేందుకు వీలుగా లేదని, వాటిని తొలగించాలని మత్స్యకార కుటుంబాలు మంగళవారం తహసీల్దార్ పీ పార్వతికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కర్రి నరసింహరావు, జీవీ రామప్రసాద్‌రెడ్డి, దండుప్రోలు రాఘవులు, రామచంద్రరావు, పోలయ్య,కర్రి ధనరాజులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి సత్కారం

చీరాల రూరల్: చీరాల కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తించి పర్చూరు కోర్టుకు బదిలీపై వెళుతున్న న్యాయమూర్తి ఎం. శుభవాణికి మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ హాలులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కటకం చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, మహిళా న్యాయవాద ప్రతినిధి ఎ. మణినాగ శయన, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



బల్లికురవలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఈపురుపాలెంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



సంతరావూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పరిసరాల శుభ్రతతో మలేరియా దూరం

- ఘనంగా ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం
- అవగాహన ర్యాలీ నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ డాక్టర్లు, సిబ్బంది

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలను నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. దోమల నిర్మూలనతో మలేరియా వ్యాధికి చెక్ పెట్టొచ్చని అద్దంకి ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ అన్నారు. మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జయచంద్రరావు మాట్లాడుతూ మలేరియా వ్యాధిని లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాల్సిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సభ్యులు, హెల్త్ సిబ్బంది, ఎంపీహెచ్‌ఈవో నీలం రామకోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

■ దోమలను నివారిస్తేనే మలేరియాను పారదోలగలమని ప్రాసంగులపాడు పీహెచ్‌సీ డాక్టర్ కే.శశికళ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, ప్రాసంగులపాడు, పమిడిపాడు, రావినూతల, రాచపూడి గ్రామ పంచాయతీల పరిధిలో పీహెచ్‌సీ సిబ్బందితో కలసి మండల అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎండీవో సురేష్‌బాబు, సర్పంచ్ ఎలీశమ్మ, ఈవో లక్ష్మీకాంత్, డాక్టర్ ఎస్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు.

■ గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు భారతి, రమీజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బందిచే గుంటుపల్లి పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శేషగిరిరావు, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ప్రేమలీల, కోటేశ్వరరమ్మ పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో మలేరియాకు చెక్..

చీరాల టౌన్/చీరాల/చీరాల అర్బన్/చీరాల రూరల్/వేటపాలెం: అన్ని రోగాలకు మూలకారణమైన దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి, పంచాయతీ సెక్రటరీ గౌస్‌లు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మార్కెట్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోక్షవాణి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

■ ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం, పాపాయిపాలెంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పి పూర్ణకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం: ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కీర్తి సరోజ్, డాక్టర్ నాగేంద్రలు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు దోమకాటువలన కలిగే నష్టాలను గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, హెల్త్ విజిటర్స్ వరదానం, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ సూపర్‌వైజర్‌లు జీ విజయ ప్రసన్న, ఏఎన్‌ఎం శాంతకుమారి, స్టాఫ్ నర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జే.పంగులూరు: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధి పూర్తిగా నివారించవచ్చని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మల్లికార్జునరావు పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం పంగులూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోటు దోమలకు ఆవాసాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, పంగులూరు సర్పంచ్ గుడిపూడా నాగేంద్రంరామావు, పంచాయతీ కార్యదర్శి లాం సునీత వైద్య , ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పంగులూరు బస్టాండ్ సెంటర్ మానవహారం..

దోమతెరలు వాడాలి..

కారంచేడు: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే మన నివాస ప్రాంతాల్లో మలేరియా వ్యాధిని నిర్మూలం చేయవచ్చని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అవగాహన ర్యాలీని నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలతో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జెస్సీరాణి, పీహెచ్‌ఎం సువర్ణజ్యోతి, వీరమ్మ, వసంతవల్లి, సుబ్బారావు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీహెచ్‌సీ నుంచి మొయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌టీ బయ్యా శంకర్ వ్యాధి తీవ్రత, నివారణకు అవసరమైన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మీనాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పమిడిపాడు పంచాయతీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



అద్దంకి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



కారంచేడులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, వైద్య సిబ్బంది



వేటపాలెంలో మలేరియా అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం సముచిత స్థానం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- థ్యాంక్యూ సీఎం కార్యక్రమానికి తరలివెళ్లిన నాయీ బ్రాహ్మణులు

చీరాల: నాయీ బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన నాయీ బ్రాహ్మణుల థ్యాంక్యూ సీఎం కార్యక్రమానికి చీరాల నుంచి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అధ్యక్షతన నాయి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ప్రత్యేక బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ సీఎం జగన్ నాయీ బ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలను, సమాజంలో మంచి గుర్తింపు ఇచ్చేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఎప్పుడు అండగా ఉంటారన్నారు. డాక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ జీవో 50 ద్వారా నాయి బ్రాహ్మణులకు ప్రతి సంవత్సరం షాప్‌కు రూ.10 వేలు, ప్రతి దేవాలయంలోని పాలకమండలిలో ఒక సభ్యుడు, షాపు ఉంటే 150 యూనిట్ల కరెంట్, దేవాలయాల్లో పనిచేసే క్షౌర వృత్తిదార్లకు నెలకు రూ.20 వేలు జీతం వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు మాట్లాడుతూ సమాజంలో రాజకీయంగా మంచి గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ పట్టణ అధ్యక్షులు మాచవరపు వెంకటేశ్వర్లు, వల్లూరి వెంకటస్వామి, మార్కాపురం వెంకటరామారావు, ఏ బోసుబాబు, కె.బాలశంకర్, నటరాజు, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మార్టూరు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం మార్టూరులోని సచివాలయం 1 పరిధిలో 18 వార్డులో కన్వీనర్ కుందుర్తి గఫూర్ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ అభివృద్ధి గురించి లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, సులేమాన్, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి, ఎస్‌ఎంటీ రషీద్, కొండ మస్తాన్, ఎంపీటీసీ కరిముల్లా, సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ రఫీ, షేక్ కరిముల్లా, బాజీ బాబా, జానీ బాషా, చందుల్లా, ఖైరుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీకి తిరునాళ్ల ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వానపత్రికను జిల్లా ఎస్పీకి అందిస్తున్న వెంకటేష్, గ్రామ పెద్దలు



జిల్లా కలెక్టర్‌ను కలిసిన వెంకటేష్

చీరాల: వేటపాలెం మండలం కటారివారిపాలెంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తిరునాళ్ల మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆ గ్రామ పెద్దలతో కలిసి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు అందించారు. కార్యక్రమంలో పెద్దకాపు కటారి వెంకటేశ్వర్లు, చిన్నకాపు కటారి తిరుపతయ్య, మూడో కాపు కొండూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వెంకటేష్..

బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషాను మంగళవారం ఆయన చాంబర్‌లో వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

శంకరాచార్యుల బోధనలు అనుసరణీయం

అద్దంకి రూరల్/మేదరమెట్ల: శంకరాచార్యుల బోధనలు అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమఠేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శంకరాచార్యుల చిత్రపటానికి పూల మాలలు వేసి సత్తెనపల్లి శ్రీశైలంచే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి నరసింహాచారి పాల్గొన్నారు.

– కొరిశపాడు మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మేదరమెట్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ హాజరై శంకరాచార్యులు చేసిన అనేక అంశాలను వివరించారు.

లారీ ప్రమాదంలో నలుగురికి గాయాలు

అద్దంకి: లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని శ్రీనివాసనగర్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం కనమలచెరువు గ్రామానికి చెందిన కుంబా చిన్న పోలయ్య, కొండమీద అంజయ్య, మర్రి చెంచయ్య, కంభంపాటి మోషే లారీ మాట్లాడుకుని పొగాకు బేళ్లు వేసుకుని ఒంగోలు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో లారీ మండలంలోని శ్రీనివాసనగర్ ప్రాంతానికి చేరుకోగానే టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో రైతులు నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం

చినగంజాం: పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి శిల్లు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ శిడులు 53వ వార్షికోత్సవం సందర్భంగా నూతలపాడు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి సిడిమాను ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పర్చూరు ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ అవాంఛనీయ ఘటలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.



అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



వృద్ధురాలికి నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మంగళవారం కొనిదెన సచివాలయ పరిధిలోని గంగపాలెం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పథకాల బ్రోచర్లు అందించారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పథకాలు అందించటం వల్ల ప్రజలంతా జగనన్నకు నీరాజనాలు పలుకుతున్నారని చెప్పారు. నాడు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు పేదలు, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగనన్నపై కుటిల రాజకీయాలు ప్రదర్శించటం హేయమైన చర్య అన్నారు. జగనన్న పక్షాన ప్రజా బలం ఉందని 2024 ఎన్నికల్లో తిరిగి రెండసారి జగనన్న సీఎం కావడం ఖాయమన్నారు. అంతకు ముందు గ్రామ కూడలిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద చైతన్య ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, కె రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, స్థానిక నేతలు టీ.విష్ణు, గుంజి ఆంజనేయులు, కుంచపు రాఘవరావు, కొసనం సుబ్బారావు, రాయుడు శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి, ఏఈలు జీ. హనుమంతరావు, దుర్గా రమేష్, వెలుగు ఏపీఎం బీ. సురేంద్రబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం నెలకొందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని సాయికాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సాయికాలనీలో ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని ఎంజీసీ మార్కెట్ దగ్గర మహాత్మాగాంధీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సాంబశివరావు, వ్యవసాయ సలహామండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నారాయణ, బుర్ల మురళి, నాదెండ్ల కోటేశ్వరరావు, గడ్డం శ్రీను, చావలి వాసు, షేక్ మస్తాన్, రాఘవయ్య, వేణుగోపాల్, కౌన్సిలర్లు మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, పి.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని హైయర్‌పేటలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బురదగుంట ఆశీర్వాదం మంగళవారం మృతి చెందడంతో వెంకటేష్ ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, తోకల అనిల్, నీలం శామ్యూల్ మోజెస్, మల్లెల రాజశేఖర్, గోలి రవి, వీ వాసు, శ్రీను, దావీదు, తిమోతిలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మార్టూరులో మంగళవారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది అశోక్ వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెద్ద కాకాని గ్రామానికి చెందిన రోశయ్య గుంటూరు వైపు బైకుపై వెళ్తూ స్థానిక జై ఆంధ్రా హోటల్ ఎదురు వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిస్థితులపై హెచ్‌ఎంలకు అవగాహన ఉండాలి

చినగంజాం: ప్రధానోపాధ్యాయులకు పాఠశాల పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో డీ గంగాధర్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రం నందు మంగళవారం ఎంఈవో అధ్యక్షతన మండలంలోని అన్ని హెచ్‌ఎంలకు పాఠశాల సామాజిక తనిఖీ, హరిత పాఠశాల అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా బీ రాఘవచంద్ర కుమార్, చైర్మన్‌లు ప్రసన్న కుమారి,శ్రీనివాసరెడ్డి,ఇంజనీర్ వెంకటరావు పాల్గొన్నారు.

హార్టీకల్చర్ నర్సరీ తనిఖీ

అద్దంకి: మొక్కలు పెంచే నర్సరీ యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మార్టూరు హార్టీకల్చర్ అధికారి బీ హనుమంతనాయక్ అన్నారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలోని నర్సరీలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హార్టీ కల్చర్ అధికారి మాట్లాడుతూ నర్సరీల యజమానులు బిల్లు పుస్తకాలు, రిజిష్టర్లు నిర్వహించాలన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలను అందజేయాలని చెప్పారు. ఇచ్చిన మొక్కలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే అని చెప్పారు. కార్యక్రమానికి గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు హాజరయ్యారు.